క్లుప్తంగా

1267 మందికి కంటి వైద్య పరీక్షలు

యానాం: యానాం ప్రభుత్వ సాధారణ ఆసుపత్రిలో ఈ నెల 2 నుంచి 7 వరకూ జరిగిన మెగా సర్జికల్ కంటి వైద్య శిబిరంలో 1267 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు జీజీహెచ్ డిప్యూటీ డైరెక్టర్ టి.రవిశంకర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. 275 మందికి కంటి ఆపరేషన్లు నిర్ణయించగా వారిలో 240 మందికి శస్త్రచికిత్సలు చేసినట్లు తెలిపారు. పాఠశాల విద్యార్థులు 125 మందిని పరీక్షించగా వారిలో 32 మందికి కళ్లజోళ్లు పంపిణీ చేశామన్నారు. ఈ మేరకు పుదుచ్చేరి డైరెక్టరేట్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్‌కు నివేదికను పంపినట్లు తెలిపారు.

మహా సౌరయాగంలో ప్రత్యేక పూజలు



రామాలయంలో పూజలు చేస్తున్న భక్తులు

ఉప్పలగుప్తం: పవిత్ర మాఘమాసాన్ని పురస్కరించుకుని మండలంలోని విలసవిల్లి రామాలయంలో మహా సౌరయాగంలో మంగళవారం విశేష పూజలు జరిపారు. యాగ కర్త మున్నంగి రామకృష్ణ శర్మ ఆధ్వర్యంలో ఆదిత్యునికి అరుణ హోమంనిర్వహించారు. మఖ నక్షత్ర జాతకులచే మర్రి మొక్కకు ప్రత్యేక పూజలు చేయించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

నేటి నుంచి సత్తెమ్మ తల్లి జాతర



సీహెచ్ గున్నేపల్లి సత్తెమ్మ తల్లి అమ్మవారు

ముమ్మిడివరం: కోనసీమ ప్రజల ఆరాధ్య దేవతగా ప్రసిద్ధి చెందిన సీహెచ్ గున్నేపల్లి సత్తెమ్మ తల్లి అమ్మవారి జాతర బుధవారం నుంచి ప్రారంభం కానుంది. ఈ నెల 8 నుంచి 12 వరకూ జాతర, తీర్థ మహోత్సవాలు జరుగుతాయి. 12న తీర్థ మహోత్సవం పురస్కరించుకుని అమ్మవారిని ఆలయ ప్రాంగణం నుంచి గ్రామ పురవీధుల్లో ఊరేగించనున్నారు. అదే రోజు భారీ అన్న సమారాధన జరగనుంది. తీర్థ మహోత్సవాలకు భక్తుల్ని అలరించేలా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు.

చికిత్స పొందుతూ ఇద్దరి మృతి

తాళ్లరేవు: మండల పరిధిలోని వేర్వేరు ప్రాంతాలలో జరిగిన రోడ్డు ప్రమాదాలలో తీవ్రంగా గాయపడిన ఇద్దరు చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కోరంగి ఎస్సై పి.శ్రీనివాస కుమార్ మంగళవారం తెలిపారు. సోమవారం రాత్రి తాళ్లరేవు చెరువుగట్టు సెంటర్ సమీపంలోని ముత్యాలమ్మ ఆలయం వద్ద రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో మోర్త గోవరాజు(49) తీవ్రంగా గాయపడి కాకినాడ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. మృతుడు గోవరాజు రాయవరంలోని జూనియర్ కళాశాలలో అధ్యాపకునిగా పనిచేస్తున్నట్లు తెలిపారు. చొల్లంగి గొడౌన్స్ వద్ద ముగ్గురు యువకులు బైక్‌పై వెళుతూ కళాశాల బస్సును ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో ఇమ్మానుయేల్ ఫ్రాంక్లిన్(20)తీవ్రంగా గాయపడి కాకినాడలోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

డ్రోన్ రిమోట్ పైలట్‌లో శిక్షణ

అల్లవరం: గుంటూరులోని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం నిర్వహించిన డీజీసీఏ అధీకృత రిమోట్ పైలట్ ట్రెనింగ్‌లో దేవగుప్తం పీఏసీఎస్‌లో విధులు నిర్వర్తిస్తున్న శిరంగు దుర్గానాగేంద్ర 12 రోజులు శిక్షణ పూర్తి చేసుకున్నారని పీఏసీఎస్ చైర్మన్ జున్నూరి రామారావు మంగళవారం తెలిపారు. వరిలో స్ప్రేయింగ్, క్రాప్ స్పెసిఫిక్ ఎస్ఏపీ పరిజ్ఞానం, నైపుణ్యంపై శిక్షణ ఇచ్చారన్నారు. పీఏసీఎస్ ఆధ్వర్యంలో డ్రోన్ ద్వారా స్ప్రేయింగ్, సీడింగ్, ఎరువులు వెదజల్లడం వంటివి నిర్వహిస్తామన్నారు. బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల్లో సహకార సంఘాల ఆధ్వర్యంలో డ్రోన్ ఏర్పాటు చేయడం ఇదే మొదటిసారని ఆయన తెలిపారు.

బీజేపీ కార్యవర్గ సమావేశం

ముమ్మిడివరం: గ్రామ స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయడానికి కార్యకర్తలు కృషి చేయాలని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అయ్యాజీ వేమా పిలుపునిచ్చారు. చినకొత్తలంకలో మంగళవారం బీజేపీ రూరల్ మండల పార్టీ అధ్యక్షుడు పీవీవీఎస్ మూర్తి రాజు అధ్యక్షతన మండల పార్టీ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మోకా వెంకట సుబ్బారావు, మండల ఇంఛార్జ్ గనిశెట్టి వెంకటేశ్వరరావు, గాలిదేవర వెంకటరమణమూర్తి, గొలకోటి వెంకటరెడ్డి, కొడమర్తి భాస్కరశర్మ తదితరులు పాల్గొన్నారు.

ఈ-పంట నమోదే ప్రామాణికం

- చివరి తేదీ ఈ నెల 20
- హక్కు పత్రం లేకపోయినా కౌలు రైతులకు అవకాశం



మొబైల్‌లో ఈ-పంట నమోదు చేస్తున్న వ్యవసాయ సహాయకులు

అల్లవరం: రైతన్నకు ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలకు ఈ-పంట నమోదే ప్రామాణికంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్ధారించింది. పంటల బీమా, ధాన్యం అమ్మకాల్లో మోసాలను నివారించడంతో పాటు ఎవరైతే పంట పండిస్తున్నారో వారికి మాత్రమే ప్రభుత్వ ప్రయోజనాలు దక్కేలా చూడటానికి ఈ నిబంధన తీసుకొచ్చింది. అంతటి కీలకమైన ఈ-పంట నమోదుకు ఫిబ్రవరి 20వ తేదీ గడువుగా నిర్ణయించినట్లు వ్యవసాయ అధికారులు చెబుతున్నారు.

రైతన్న త్వరపడాలి

అమలాపురం, ముమ్మిడివరం నియోజకవర్గాల్లో 77 శాతం ఈ-పంట నమోదు ప్రక్రియ పూర్తి చేశారు. ఈ-పంట నమోదుకు మరో 12 రోజులే గడువున్న నేపథ్యంలో అన్నదాతలంతా త్వరపడాల్సిన అవసరముంది. ఈ-పంట నమోదు చేసిన రైతులు దగ్గర్లోని సచివాలయంలో ఈ-కేవైసీ సైతం నమోదు చేసుకోవాలి. సాగు చేసే ప్రతి రైతు ఈకేవైసీలో నమోదు చేసుకుంటే ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు రైతు భరోసా, పంటల బీమా, సున్నా వడ్డీ పంట రుణాలు, ధాన్యం అమ్మకాలకు అర్హుడవుతాడు. కౌలుదారుడైతే పంట సాగు హక్కు పత్రం వ్యవసాయ సిబ్బందికి అందించి ఈ-పంట నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. కౌలుదారుడుకి సాగు హక్కుపత్రం లేకపోయినా వీఏఓలకు సెల్ఫ్ డిక్లరేషన్ సమర్పించి ఈ-పంట నమోదు చేసుకునే అవకాశం కల్పించారు.

మండలాలవారీగా ఈ-పంట నమోదు విస్తీర్ణం, నమోదు శాతం

మండలం	సాగు విస్తీర్ణం (ఎకరాల్లో)	ఈ-పంట నమోదు విస్తీర్ణం (ఎకరాల్లో)	నమోదు శాతం
అల్లవరం	4370	4014.92	92
అమలాపురం	5325	4562.47	86
ఉప్పలగుప్తం	7210	5684.00	79
కాట్రేనికోన	7524	5910.88	79
ఐ.పోలవరం	8052	5920.05	74
ముమ్మిడివరం	7178	3891.89	54

ఈ-కేవైసీ తప్పనిసరిగా నమోదు చేసుకోవాలి



రైతులకు ప్రభుత్వ అందించే సంక్షేమ పథకాలన్నింటికీ ఈ-పంట నమోదే ప్రామాణికం. అందుకే రైతులంతా ఈ నెల 20వ తేదీలోగా ఈ-పంటతో పాటు ఈ-కేవైసీ సైతం నమోదు చేసుకోవాలి. గడువులోగా లక్ష్యాన్ని చేరుకునేందుకు క్షేత్రస్థాయిలో వీఏఓలు పనిచేస్తున్నారు.

– ఎస్‌వీవీ సత్యనారాయణ, వ్యవసాయాధికారి, అల్లవరం

పార్టీని విజయపథంలో నడిపించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్

ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్

ముమ్మిడివరం: గ్రామ, వార్డు సచివాలయ పరిధిలో నియమించిన కన్వీనర్లు, గృహసారథులు సమన్వయంతో పనిచేసి పార్టీని విజయపథంలో నడిపించాలని ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్ కుమార్ అన్నారు. మహిపాల చెరువు గ్రాండ్ పార్క్ కన్వెన్షన్ హాల్‌లో నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు బుర్రా అనుబాబు అధ్యక్షతన కన్వీనర్లు, గృహసారథులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ మాట్లాడుతూ కన్వీనర్లు, గృహసారథులు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను విస్తృతంగా ప్రచారం చేసి ప్రజల్లోకి తీసుకెళ్లాలని చెప్పారు. ప్రతిపక్షాలు, ఎల్లో మీడియా ప్రభుత్వంపై చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని తిప్పి కొట్టాలన్నారు. పార్టీ పరిశీలకుడు బుర్రా అనుబాబు మాట్లాడుతూ 2024 సార్వత్రిక ఎన్నికలకు పార్టీ కేడర్ సన్నద్ధం కావాలని సూచించారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్, పార్టీ రాష్ట్ర కార్యదర్శులు పెన్మత్స చిట్టిరాజు, పెయ్యల చిట్టిబాబు, జెడ్పీటీసీ కుడిపూడి శంకరరావు, హితకారిణి సమాజం చైర్ పర్సన్ కాశి బాలమునికుమారి, కోలా బాబ్జి, జగతా పద్మనాభం తదితరులు పాల్గొన్నారు.

సాగు నీరందించాలని రైతుల రాస్తారోకో

జాతీయ రహదారి 216పై బైఠాయింపు



జాతీయ రహదారి 216పై బైఠాయించిన రైతులు

తాళ్లరేవు: మండల పరిధిలోని అనేక గ్రామాల్లో శివారు భూములకు సాగు నీరందక వరి చేలు ఎండిపోతున్నాయంటూ రైతులు జాతీయ రహదారి 216పై రాస్తారోకో నిర్వహించారు. మంగళవారం ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో పోలేకుర్రు ఇరిగేషన్ కాలువ వద్ద రహదారిపై రైతులు బైఠాయించడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి వల్లు రాజబాబు మాట్లాడుతూ ఏటా ఇదే సమయంలో నీటి ఎద్దడి వస్తున్నా అధికారులు ఎటువంటి చర్యలు చేపట్టడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే ఎకరానికి రూ.25 వేలు పెట్టుబడి పెట్టారని, వరి చేలు ఎండిపోతే రైతులు తీవ్రంగా నష్టపోతారన్నారు. మండలంలోని చమురు సంస్థలతో పాటు రొయ్యల చెరువులకు నీరు తరలించుకుపోవడం వల్ల నీరు సరిపోక వరిచేలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పలివెల ఏడుకొండలు, పిల్లి శ్రీనివాస్, మేడిశెట్టి శ్రీనివాస్, పిల్లి వీరనాగు, బాదం సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మాక్ డ్రిల్ విజయవంతానికి సహకరించాలి



మాక్ డ్రిల్ ఏర్పాట్ల గురించి వివరిస్తున్న ఆర్ఏఓ మునిస్వామి(చిత్రంలో ఎస్పీ రఘునాయగం)

యానాం: ప్రకృతి వైపరీత్యాల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఈ నెల 10న నిర్వహించే మాక్ డ్రిల్ విజయవంతం చేసేందుకు అందరూ సహకరించాలని రీజనల్ అడ్మినిస్ట్రేటర్ మునిస్వామి కోరారు. మంగళవారం ఆయన తన ఛాంబర్‌లో విలేకరులతో మాట్లాడాతూ 10వ తేదీ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ మాక్ డ్రిల్ జరుగుతుందన్నారు. మాక్ డ్రిల్‌లో ప్రధానంగా భారీ వర్షాలు, వరద ప్రభావిత ప్రాంతాల్లో బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించడం, సహాయక చర్యలు, రిలీఫ్ క్యాంప్‌ల ఏర్పాటు తదితర అయిదు అంశాల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోలీస్, కోస్టల్ పోలీస్, అగ్నిమాపక, రెవెన్యూ, ఫిషరీస్, మున్సిపాలిటీ తదితర శాఖలు పాల్గొంటాయని చెప్పారు. సమావేశంలో ఎస్పీ రఘునాయగం, డీటీ సత్యనారాయణ్ పాల్గొన్నారు.

గౌరవ వేతనంతో అనాథ వృద్ధులకు వితరణ



వృద్ధులకు నిత్యావసర సరకులు అందజేస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

అమలాపురం రూరల్: కామనగరువు సర్పంచ్, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షురాలు నక్కా అరుణకుమారి ప్రభుత్వం తనకిచ్చే గౌరవ వేతనం రూ.3 వేలతో పాటు మరో రూ.3 వేలు కలిపి వృద్ధుల అనాథాశ్రమానికి కిరాణా వస్తువులు అందించారు. కామనగరువులో ఉన్న ఆర్‌సీఎం వయోవృద్ధుల అనాథాశ్రమంలో జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా చేతుల మీదుగా మంగళవారం నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ హిమాన్షుశుక్లా మాట్లాడుతూ సమాజంలో వృద్ధులను ఆదుకునేందుకు మానవతా దృక్పథంతో దాతలు ముందుకు రావాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ఇక నుంచి ప్రతి నెల వచ్చే గౌరవ వేతనంతో వృద్ధులకు వితరణ అందిస్తానని సర్పంచ్ అరుణకుమారి ప్రకటించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో కాశీ విజయ ప్రసాద్, తహసీల్దార్ పరమట శ్రీపల్లవి, కార్యదర్శి ఎ.రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన ఆక్వా రైతులందరికీ విద్యుత్ సబ్సిడీ

మత్స్య శాఖ జేడీ షేక్‌లాల్ మహమ్మద్



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న జేడీ షేక్ లాల్ మహమ్మద్

ముమ్మిడివరం: జిల్లాలో ఆక్వా సాగు చేస్తున్న అర్హులైన రైతులందరికీ విద్యుత్ సబ్సిడీ అందించేందుకు చర్యలు చేపడుతున్నామని మత్స్య శాఖ జాయింట్ డైరెక్టర్ షేక్ లాల్ మహమ్మద్ తెలిపారు. ముమ్మిడివరం ఎయిమ్స్ ఇంజినీరింగ్ కళాశాలలోని మత్స్య శాఖ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. జిల్లాలో 22 మండలాల్లో 39 వేల ఎకరాల్లో ఆక్వా సాగు చేస్తున్నారన్నారు. జిల్లాలో 5,700 ఆక్వా విద్యుత్ కనెక్షన్లను ఈ-ఫిష్ చేశారన్నారు. వాటిలో 2200 కనెక్షన్లు మాత్రమే అర్హత జాబితాలో ఉన్నాయని చెప్పారు. దీనిపై కోనసీమ ఆక్వా ఫార్మర్ అసోసియేషన్ ప్రతినిధులు సోమవారం స్పందనలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారన్నారు. సబ్ డివిజన్ అయిన సర్వే నెంబర్లను పరిశీలించేంత వరకూ 10 ఎకరాల పైబడి ఆక్వా సాగు చేస్తున్నవారికి సబ్సిడీ కొనసాగించాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా సూచించారన్నారు. సీబార్, సీఏఏ, ఎంపెడా తదితర నేషనల్ లెవల్ ఇనిస్టిట్యూట్‌ల నిపుణుల కమిటీతో సమావేశమై నాన్‌జోన్‌లో ఉన్నవాటిని ఆక్వాజోన్ పరిధిలోకి తీసుకొచ్చి 90 శాతం మంది ఆక్వా రైతులకు అర్హత కల్పించేందుకు కృషి చేస్తామన్నారు.

కబడ్డీ పోటీల్లో రీజెన్సీకి ప్రథమ స్థానం



కబడ్డీ పోటీల్లో ప్రథమ స్థానాన్ని సాధించిన రీజెన్సీ కళాశాల జట్టు

యానాం: యువజన దినోత్సవాలను పురస్కరించుకుని నెహ్రూ యువ కేంద్రం యానాం శాఖచే జిల్లా స్థాయిలో నిర్వహించిన కబడ్డీ పోటీల్లో స్థానిక రీజెన్సీ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రథమ స్థానం కైవసం చేసుకున్నారని ప్రిన్సిపాల్ మార్తాండప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వ్యాయామ ఉపాధ్యాయుడు పి.సోమేష్ పర్యవేక్షణలో విద్యార్థులను అత్యుత్తమంగా తీర్చిదిద్దారని కొనియాడారు. ఈ సందర్భంగా విద్యార్థులను విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ జీఎస్‌నాయుడు, హెచ్ఎం ప్రసాదరావు, ఎస్.వీరకుమార్ అభినందించారు.

ఆక్వా రాయితీలను సద్వినియోగం చేసుకోవాలి



పి.మల్లవరం గ్రామసభలో మాట్లాడుతున్న ఎంపీపీ రాయుడు సునీత

తాళ్లరేవు: విదేశీమారక ద్రవ్యాన్ని అధికంగా ఆర్జించి పెట్టే ఆక్వా రంగానికి ప్రభుత్వమిచ్చే రాయితీలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ రాయుడు సునీత అన్నారు. మంగళవారం పి.మల్లవరంలో సర్పంచ్ దున్నా సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఆక్వా గ్రామసభకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆక్వా రైతులందరూ ప్రభుత్వ నిబంధనల మేరకు సాగు చేసి అధిక లాభాలు ఆర్జించాలని కోరారు. మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ దున్నా జనార్దనరావు మాట్లాడుతూ ఆక్వా రంగం అభివృద్ధి కోసం యూనిట్ విద్యుత్ కేవలం రూపాయిన్నరకే సరఫరా చేస్తుందని తెలిపారు. పోలేకుర్రు, గాడిమొగ గ్రామాల్లోను గ్రామసభలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ఎఫ్‌డీఓ జి.గోపి, వైస్ ఎంపీపీ ధూళిపూడి నాగేంద్రప్రసాద్, ఎంపీటీసీ సభ్యుడు దున్నా రాంబాబు, నాయకులు రాయుడు గంగాధర్, ఉంగరాల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పందుల మరణాలపై కొనసాగుతున్న పరిశోధనలు

- స్వైన్ ఫ్లేగ్, స్వైన్ ఫీవర్‌లపై నెగిటివ్ రిపోర్ట్‌లు
- వ్యాక్సిన్లతో క్రమేపీ తగ్గుతున్న మరణాలు



చనిపోయిన పందులను ఖననానికి చెత్త బండిలో తరలిస్తున్న దృశ్యం

అమలాపురం టౌన్: పందుల మరణ మృదంగంపై జిల్లా పశు సంవర్ధకశాఖ చేపట్టిన పరిశోధనలు కొనసాగుతున్నాయి. జిల్లాలో ఇప్పటివరకూ అనధికార లెక్కల ప్రకారం రెండు వేలకు పైగా పందులు మృత్యువాత పడినట్లుగా అంచనా. పోస్టుమార్టం, రక్త నమూనాల ఆధారంగా చేసిన పరీక్షలకు సంబంధించి విజయవాడలోని వెటర్నరీ బయోలాజికల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ (వీబీఆర్ఐ) రెండు నివేదికలు పంపించింది. స్వైన్ ఫ్లేగ్, స్వైన్ ఫీవర్ వ్యాధులపరంగా నెగిటివ్ రిపోర్టులు రావడంతో వాటి వల్ల మరణాలు సంభవించడం లేదని జిల్లా పశు వైద్యాధికారులు నిర్ధారణకు వచ్చారు. బాక్టీరియాకు సంబంధించిన బి.కొలై పరీక్ష మాత్రం పాజిటివ్ వచ్చింది. అయితే ఈ బాక్టీరియా వల్ల పందులు చనిపోయేంత ప్రమాదం లేదని నిపుణులు తేల్చి చెబుతున్నారు. దీంతో ఆఫ్రికన్ స్వైన్ ఫీవర్‌పై పరీక్ష కోసం పరిశోధన కేంద్రాల్లో లోతైన అధ్యయనం చేస్తున్నారు.

వ్యాక్సిన్లతో అడ్డుకట్ట

అమలాపురం పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ ఎల్.విజయారెడ్డి, అమలాపురం మున్సిపల్ కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడుతో కూడిన వైద్య, మున్సిపల్ బృందాలు వైరస్ ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించి పందులకు ముందస్తు వ్యాక్సిన్ ఇస్తున్నారు. ఇప్పటికే 2,600 వ్యాక్సిన్లు పూర్తి చేశారు. వ్యాక్సిన్లు ఇవ్వడం ప్రారంభించాక మరణాల సంఖ్య గణనీయంగా తగ్గుముఖం పడుతోందని పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ విజయారెడ్డి స్పష్టం చేశారు.

గోదావరిలో దూకి యువకుడి గల్లంతు



ఒకరోజు ముందుగానే వాట్సాప్ స్టేటస్‌గా పెట్టుకున్న శ్రద్ధాంజలి ప్రకటన

యానాం: యానాం సమీపంలో మంగళవారం రాత్రి ఓ యువకుడు గౌతమీగోదావరిలో దూకి ఆత్మహత్యకు యత్నించాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తాళ్లరేవు మండలం పెదగోవలంకకు చెందిన చిల్లా రాజ్‌కిరణ్(21) అనే యువకుడు మంగళవారం రాత్రి స్థానిక యానాం-ఎదుర్లంక బాలయోగి వారధి 5వ నెంబరు ఫిల్లర్ పైనుంచి గోదావరిలో దూకేశాడు. స్థానికులు చూసి సమాచారమివ్వడంతో యానాం బీట్ పోలీసులు రంగంలోకి దిగారు. గోదావరిలో కొట్టుకుపోతున్న రాజ్‌కిరణ్‌ను రక్షించడానికి వంతెన పైనుంచి తాళ్లను విసిరి ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. దీంతో మత్స్యకారుల పడవల సహాయంతో గాలింపు చర్యలు చేపట్టారు. ఆత్మహత్యా యత్నానికి ప్రేమ వ్యవహారమే కారణమని అనుమానిస్తున్నారు. చనిపోవాలని నిర్ణయించుకున్న రాజ్‌కిరణ్ ఒక రోజు ముందుగానే తన ఫొటోతో శ్రద్ధాంజలి ప్రకటనను తయారుచేసుకుని వాట్సాప్ స్టేటస్‌గా పెట్టుకున్నాడని అతడి స్నేహితులు పోలీసులకు చూపించారు.

రాష్ట్ర స్థాయి క్రీడల్లో బీవీసీ విద్యార్థుల ప్రతిభ



తమ విద్యార్థి సాధించిన షీల్డ్‌ను ప్రదర్శిస్తున్న కళాశాల ప్రతినిధులు

అమలాపురం రూరల్: భట్లపాలెం బీవీసీ ఇంజినీరింగ్ కళాశాలలో ఎంబీఏ మొదటి సంవత్సరం చదువుతున్న ఎం.వీరేంద్ర జేఎన్‌టీయూ యూనివర్సిటీ పరిధిలో వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్‌లో ప్రతిభ చాటి స్ట్రాంగ్ మ్యాన్ ఆఫ్ యూనివర్సిటీగా నిలిచాడు. పాలిటెక్నిక్ మీట్‌లో మొదటి సంవత్సరం చదువుతున్న సాత్విక్ రాష్ట్ర స్థాయి చెస్‌లో ఛాంపియన్‌గా నిలిచి జాతీయ స్థాయి క్రీడలకు ఎంపికయ్యాడు. ఉత్తమ ప్రతిభ చాటిన క్రీడాకారులు వీరేంద్ర, సాత్విక్ లను కళాశాల చైర్మన్ బోనం కృష్ణ సతీష్, ప్రిన్సిపాల్ జేవీజీ రామారావు, ఏఓ జక్కం కృష్ణారావు, పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ బందారు పణి, పీడీ రవణం మాధవి తదితరులు అభినందించారు.

నవోదయ దరఖాస్తుల గడువు పొడిగింపు

యానాం: నవోదయ విద్యాలయలో 2023-24 విద్యా సంవత్సరానికి గాను ఆరో తరగతిలో అడ్మిషన్లు పొందేందుకు నిర్వహించే ఎంట్రన్స్ టెస్ట్‌కు దరఖాస్తుల స్వీకరణ గడువును ఈ నెల 15 వరకు పొడిగించినట్లు మంగళవారం ప్రిన్సిపాల్ ప్రకాశరావు తెలిపారు. ఆన్‌లైన్ దరఖాస్తులో తప్పులుంటే ఈ నెల 16, 17 తేదీల్లో అభ్యర్థులు 'నవోదయ.జీఒవి.ఇన్' తెరిచి సరిదిద్దుకోవొచ్చని సూచించారు.

రమాబాయికి ఘన నివాళి

తాళ్లరేవు: భారత రాజ్యాంగ నిర్మాత డా.బీఆర్ అంబేడ్కర్ సతీమణి రమాబాయి జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ రాయుడు సునీత, ఎంపీడీఓ ఎం.అనుపమ తదితరులు రమాబాయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ మల్లాడి భైరవ మూర్తి, నాయకులు రాయుడు గంగాధర్, చిట్టూరి చలపతి తదితరులు పాల్గొన్నారు.

సుకన్య సమృద్ధి యోజనను సద్వినియోగం చేసుకోవాలి



శ్రీధర్, పోస్టల్ సూపరింటెండెంట్

అమలాపురం టౌన్: బాలికల బంగారు భవితకు భరోసా ఇచ్చే సుకన్య సమృద్ధి యోజన పథకాన్ని బాలికల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని అమలాపురం పోస్టల్ డివిజన్ సూరింటెండెంట్ సలాది శ్రీధర్ పిలుపునిచ్చారు. మంగళవారం సాయంత్రం శ్రీధర్ స్థానిక విలేకర్లతో మాట్లాడారు. ఈనెల 9, 10, 11 తేదీల్లో డివిజన్‌లోని పోస్టాఫీసుల్లో సుకన్య సమృద్ధి యోజన స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామన్నారు. పదేళ్ల లోపు వయసున్న బాలికల తల్లిదండ్రులు దగ్గరలో ఉన్న పోస్టాఫీసుకు వెళ్లి పథకంలో చేరొచ్చన్నారు. కేవలం రూ.250తో ఈ పథకం ఖాతాను తెరుచుకోవచ్చని చెప్పారు. బాలిక వయసు 18 సంవత్సరాలు నిండాక ఉన్నత విద్య, వివాహం కోసం 50 శాతం నగదును పొందే వెసులుబాటు ఉంటుందని వివరించారు. 21 సంవత్సరాలు పూర్తి కాగానే మొత్తం సొమ్మును ఉపసంహరించుకోవచ్చని సూచించారు.

రంగాపురం చేనేత సహకార అధ్యక్షుడిగా కరెళ్ల



రంగాపురం చేనేత సహకార ఉత్పత్తి విక్రయ సంఘం నూతన కార్యవర్గ సభ్యులు

అమలాపురం రూరల్: రంగాపురం రామలింగేశ్వర చేనేత సహకార ఉత్పత్తి విక్రయ సంఘం అధ్యక్షుడిగా కరెళ్ళ శివశంకర సుబ్రహ్మణ్యేశ్వరరావు ఎన్నికయ్యారు. రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ ఆదేశాల మేరకు రాష్ట్ర బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ కరెళ్ళ రమేష్‌బాబు అధ్యక్షతన రామలింగేశ్వర చేనేత సహకార ఉత్పత్తి విక్రయ సంఘం నూతన కార్యవర్గం ఏర్పాటు చేశారు. డైరెక్టర్లుగా పాలాటి ఆదినారాయణ, కరెళ్ళ మహేష్, వాసా భాస్కరరావు, సోరపల్లి మాచర సత్యవేణిలు ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గంతో మంగళవారం ప్రమాణ స్వీకారం చేయించారు.

సెలవు రోజు మార్పుపై చర్చ



సెలవు దినం మార్పుపై చర్చిస్తున్న అమలాపురం చాంబర్ ఆఫ్ కామర్స్ వ్యాపారులు

అమలాపురం టౌన్: పట్టణంలో పూర్వం నుంచి ఉన్న మంగళవారం సెలవు దినాన్ని ఆదివారానికి మార్చాలనే అంశంపై పట్టణ చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో స్థానిక కల్వకొలను వీధిలో మంగళవారం సాయంత్రం జరిగిన సమావేశంలో చర్చించారు. చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కల్వకొలను తాతాజీ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మెజార్టీ ట్రేడ్ యూనియన్ల వ్యాపారులు సెలవును ఆదివారానికి మార్చాలని సూచించారు. 19న జరగనున్న చాంబర్ ఆఫ్ కామర్స్ సర్వ సభ్య సమావేశంలో తుది నిర్ణయం తీసుకోవాలని తీర్మానించారు. సమావేశంలో వివిధ వర్తక సంఘాల ప్రతినిధులు యెండూరి నాగబాబు, కుప్పాల రామకృష్ణ, సప్పా నాగేశ్వరరావు, సంగినీడి బాబులు, బోణం సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

సీతారామాలయంలో ప్రతిష్ఠోత్సవాలు

తాళ్లరేవు: పత్తిగొందిలో పునర్నిర్మించిన సీతారామాలయంలో ప్రతిష్ఠోత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. వేద పండితులు సుదర్శనం వెంకట జనార్దనాచార్యులు నేతృత్వంలో విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, దీక్షాధారణ, సర్వదేవతాప్రార్థనా, చతుర్వేద పారాయణ చేశారు. సాయంత్రం యాగశాల ప్రవేశం, వాస్తుపూజ, అగ్ని ప్రతిష్ఠాపన, శాంతి హోమాలు జరిపారు. కార్యక్రమంలో ఆలయ నిర్మాణకర్త కుడుపూడి శివన్నారాయణ, ఎంపీపీ రాయుడు సునీత, చిట్టూరి నాగమణి పాల్గొన్నారు.